క్లుప్తంగా

నేటి నుంచి ఎన్ఆర్ఐలో అలర్జీపై కాన్ఫరెన్స్



మంగళగిరి: చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఉన్న క్యాన్సర్ సెంటర్‌లో జాతీయ అలర్జీ కాన్ఫరెన్స్ శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు పిల్లల వైద్యుడు డాక్టర్ సుబ్బారావు శుక్రవారం తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, కాలుష్యం, ఆహారపు అలవాట్లు, అలర్జీలకు కారణాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. జాతీయ పిల్లల అలర్జీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమోహన్ నాయర్, కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధనేష్ వాల్వేకర్ తదితరులు పాల్గొంటారన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల సమాఖ్య ఆధ్వర్యంలో పిల్లలకు సంబంధించిన ఎలర్జీలపై నూతన వ్యాధి నిర్ణయ పరిశోధనలు, పరీక్షలపై చర్చలు జరుగుతాయని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్ : నులక పేట మాతా శివ చైతన్య ఆశ్రమంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శిబిరాన్ని చైతన్య తపోవన్ అధిపతి మాత శ్రీ శివ చైతన్య ప్రారంభించారు. హాస్పిటల్ ఫౌండర్, గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ మాట్లాడుతూ ఎకో, ఈసీజీ, మెదడు, నరాలు, ఆర్థో, కిడ్నీ, కంటి, గైనిక్ పరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారని తెలిపారు. హాస్పిటల్ మేనేజర్ శ్రీను చౌదరి, కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగకిరణ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శైలజ, గైనకాలజిస్ట్ డాక్టర్ సుభద్ర, ల్యాబ్ టెక్నీషియన్ భవాని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు సి.ఇందర మాట్లాడుతూ హెచ్ఐవీ అనేది శరీర రోగ నిరోధక వ్యవస్థపై దాడి చేసే వైరస్ అని, ఎయిడ్స్ అనేది సంక్రమణ అత్యంత అధునాతన దశలో సంభవిస్తుందన్నారు. హెచ్ఐవీ తెల్ల రక్త కణాలను లక్ష్యంగా చేసుకుని రోగ నిరోధక శక్తిని బలహీన పరుస్తుందన్నారు.నివారణ మార్గాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ కొత్త గిరిధరరావు, వైస్ ప్రిన్సిపల్ టి.రాఘవరెడ్డి, వై.పూర్ణచంద్రరావు, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు, సిబ్బంది జానమ్మ, అలీఖాన్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

మంగళగిరి: అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా ఇందిరా నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మెడికల్ ఆఫీసర్లు పి.అనూష, రాజేశ్వరి, శుభమ్ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్, తాడేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రముఖులు సంచరించే రహదారుల్లో భద్రత నిమిత్తం పోలీస్ శాఖ నిఘా నేత్రాలను ఏర్పాటు చేసింది. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు ఎస్పీ సతీష్ కుమార్ పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఉండవల్లి, కృష్ణానది అమరావతి కరకట్ట వెంబడి ప్రకాశం బ్యారేజ్ మీద నుంచి సచివాలయం వరకు, ఉండవల్లి సెంటర్, బోటు యార్డు రోడ్డు, మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి, ఓల్డ్ టోల్ గేటు, 16వ నంబరు జాతీయ రహదారి, కనకదుర్గ వారధి, తెనాలి ఫ్లైఓవర్, ఎన్ఆర్ఐ జంక్షన్, కాజా టోల్‌గేట్ ప్రాంతాల్లోని సీసీ కెమెరాలకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. నిత్య పర్యవేక్షణకు డీజీపీ, ఎస్పీ కార్యాలయాల్లో, వెలగపూడి సచివాలయంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఘనంగా వైద్యుల కార్తిక వన సమారాధన



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం పెద వడ్లపూడి గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డీబీఎస్ గార్డెన్స్‌లో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. విజయలక్ష్మి పాల్గొని, మాట్లాడారు. కుటుంబంలా వన సమారాధన జరగడం సంతోషమన్నారు. మెడికల్ ఆఫీర్లు, హెల్త్ సెంటర్ల సిబ్బంది రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ, జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ సుబ్బరాయన్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్ బాబు, డీపీఎంఓ డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్, ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, ఎంటీఎంసీ పరిధిలోని హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పి.అనూష, డాక్టర్ సతీష్, డాక్టర్ రామానంద్, డాక్టర్ షేక్ ముబీన, డాక్టర్ శాంత కుమారి, డాక్టర్ అనూష, డాక్టర్ నాగేంద్రబాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎ. శ్రీమన్నారాయణ, సూపర్ వైజర్ సాగర్, పీహెచ్ఎన్ స్వర్ణలత, ఎంపీహెచ్ఈఓ దుర్గా ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు పట్టెం లాజర్, రాణి పాల్గొన్నారు.

పిల్లల భద్రత పెద్దల బాధ్యత



మాట్లాడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు

నెక్కల్లు(తాడికొండ): పిల్లల భద్రత పెద్దల బాధ్యత అని, అమూల్యమైన బాల్యం అవగాహనతో ముందుకు తీసుకెళితే భవితకు బంగారు బాటలు వేయవచ్చని చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో గుడ్ షెపర్డ్ సిస్టర్స్ సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పిల్లల భద్రత పెద్దల బాధ్యత అనే అంశంపై నిర్వహించిన అవవగాహన సదస్సుకు పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన శైలిలో పిల్లలు ఎక్కువగా టీవీ, సెల్ ఫోన్‌లలో బిజీ బిజీగా గడపుతున్నారన్నారు. ఇది వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందిపై ఉందన్నారు. హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 100 లకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. గుడ్ షెపర్డ్ కాన్వెంట్ తుళ్లూరు మండల కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు, కార్యదర్శి ఎం.సాయి నాగేంద్ర, మహిళా కానిస్టేబుల్ కె.శ్రావణి, సిబ్బంది ఎస్ నాగమణి, బి.విజయలక్ష్మి, జె.ఇశ్రాయేల్ పాల్గొన్నారు.

దీక్షలతో కాదని పునాది తవ్వారు

ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో కార్మికుల నిర్మాణాలు



ఫ్యాక్టరీ భూముల్లో కార్మికుల నిర్మాణం

తాడేపల్లిరూరల్ : యాజమాన్యం తమకు బకాయిలను చెల్లించాలని నెలకుపైగా దీక్షలు చేపట్టిన బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు శుక్రవారం ఫ్యాక్టరీ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి దిగారు. తాడేపల్లి సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికులు ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, తమ శక్తినంత కూడదీసుకుని రేకుల షెడ్లు వేసుకుంటున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి పోరాటం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, ఆశీర్వాదం, యెహోషువా, సాంబయ్య, శారద, రమాదేవి, దుర్గమ్మ, సారమ్మ, గురవయ్య, ఇమాంబి, కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ జె.సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మైలా నగర్, ద్వారకా నగర్, ఇందిరా నగర్, వీవర్స్ కాలనీ, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని వినియోగదారులు గమనించాలని కోరారు.

గుర్తు తెలియని మహిళ మృతి



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బస్టాండు సమీపంలో గుర్తుతెలియని మహిళ(50)అనారోగ్యంతో మృతి చెంది పడి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు మార్చురీకి పంపించినట్లు చెప్పారు. ఆమె గురించిన సమాచారం తెలిసిన వారు స్థానిక పోలీసు స్టేషన్ లేదా 94409 00876 నంబరుకు సంప్రదించాలన్నారు.

డిసెంబర్ 2 నుంచి ప్రవచనాలు

నగరంపాలెం: డిసెంబర్ 2 నుంచి సమన్వయ సరస్వతీ, వాగ్దేవి వరపుత్ర బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ 'శ్రీవిష్ణు సహస్రనామ భాష్యం' ప్రవచనం నిర్వహించనున్నట్లు శ్రీ శారదా పరమేశ్వరీ దేవస్థానం నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంపత్‌నగర్‌లోని దేవస్థానంలో డిసెంబర్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి ప్రవచనాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ జువాలజీ, కెమిస్ట్రీ, ఎంఏ ఎకనామిక్స్, కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏపీ పీజీ సెట్‌కు హాజరు కాకున్నప్పటికీ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆయా సబ్జెక్టుల వారీగా 92464 52235(జువాలజీ), 99859 04415 (కెమిస్ట్రీ), 98488 98289 (ఎకనామిక్స్) సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతిభ చాటిన తాడేపల్లి విద్యార్థులు



విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని గుడ్ న్యూస్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు త్రోబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. వారిని పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ రెవ.ఫాదర్ ఆరోకియా దాస్ శుక్రవారం అభినందించారు. గత గురువారం గుంటూరులో జరిగిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో అండర్ 14 క్యాటగిరీలో సింధు, జి.హర్షిత, లాస్య, సరి, లికిత, నందిని, మేఘన, హర్షిత, అక్షయ, ప్రియ, సుజాత జట్టు విజయం సాధించిందన్నారు. పీడీ అజయ్‌కుమార్, పీఈటీ కె.యశ్వని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన



వివరాలు అడుగుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎంలు భద్రపరిచే గోడౌన్‌ను ఆర్డీవో కె.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. గోడౌన్‌కు వేసి ఉన్న తాళాలు, సీలు, సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరా గురించి తెలుసుకున్నారు. అగ్నిమాపక పరికరాల పనితీరు, సెక్యూరిటీ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. తహసీల్దార్ ప్రసాదరావు, ఏఎస్‌వో శివ, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రెహమాన్, నాగరాజు, వీఆర్వో నరేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకిచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రకార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

ఫిరంగిపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అర్హులైన పేదల నుంచి ఇళ్ల స్థలాల కోసం అర్జీలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల మేరకు పట్టణ ప్రాంత నిరు పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా నగదు సహాయం చేయాలన్నారు. 500 మంది పేదలు అర్జీలు అందజేశారు. అర్జీలన్నింటినీ శనివారం అధికారులకు అందజేస్తామని పార్టీ నాయకులు చెప్పారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివశంకరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతురావు, కేతినేని అగస్టీన్, నాయకులు రాంప్రసాద్, షేక్.కరిముల్లాలు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ లేని వ్యవస్థను ఊహించలేం

20 మంది ఫొటోగ్రాఫర్లకు సత్కారం



ఫొటోగ్రాఫర్‌ను సత్కరిస్తున్న అతిథులు

నగరంపాలెం: సమాజంలో ఫొటోగ్రఫీ లేని వ్యవస్థను ఊహించలేమని విశ్రాంత ఎస్పీ డి.కోటేశ్వరరావు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని పద్మావతి కళ్యాణ వేదికపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో ఫొటో ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఎస్పీ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో లలిత కళల్లో చిత్ర లేఖనం తర్వాత ఫొటోగ్రఫీ అత్యున్నత స్థానంలో విరాజిల్లుతుందని అన్నారు. పోలీస్ వ్యవస్థలో నేరస్తులను కోర్టుల్లో హాజరుపరిచేందుకు సాక్ష్యాధారాల్లో ఫొటోగ్రఫి చాలా కీలకమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలకుపైగా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఫొటోగ్రఫీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అకాడమీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి జిల్లాకు గర్వకారణమని చెప్పారు. విశిష్ట అతిథి ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆఫ్ ఆర్ట్స్ కల్చర్ అండ్ హెరిటేజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఒక ఫొటోగ్రాఫ్ లక్ష మెదళ్లకు ఆలోచనలను కల్పిస్తుందని అన్నారు. అధ్యక్షత వహించిన అకాడమీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ జీవన విధానంలో ఫొటోగ్రఫీ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఫొటోగ్రఫీ నూతనత్వాన్ని పెంచేలా సంఘ సభ్యుల సహకారంతో విస్తృతంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వివిధ రంగాల్లోని 20 మంది ఫొటోగ్రాఫర్లను జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించారు. విశ్రాంత ఎస్పీ నాగరాజు, ఏపీ ఫొటోగ్రఫీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, మాలతి, సభ్యులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ శిరీష

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి, మోసపోవద్దని వ్యవసాయ అధికారి పి. శిరీష పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కల్పించిందని, కొనుగోలుకు అవసరమైన గోతాలను డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తోందన్నారు. ముఠా కూలీ ఖర్చులకు క్వింటాకు రూ.17.17 చొప్పున చెల్లిస్తుందని, రవాణా సౌకర్యం కూడా కల్పిస్తోందని రైతులకు వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

స్టాండింగ్ కమిటీ ఆమోదం హర్షణీయం



మేయర్‌ను కలసి ధన్యవాదాలు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నెహ్రూ నగర్: నగర పాలక సంస్థలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికుల జీతాల బకాయిల చెల్లింపు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు పండగ కానుక కింద వెయ్యి రూపాయలు చెల్లించేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపడం హర్షించదగ్గ విషయమని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ సంస్థ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నగర మేయర్‌ను సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన క్రమంలో వారికి చెల్లించాల్సిన జీతాల్లో కోత విధించారని.. 9 నెలల పాటు మూడు వేల రూపాయలు జీతం తగ్గించి ఇచ్చారని చెప్పారు. దీనిపై పలుమార్లు నగర కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. శుక్రవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో బకాయిల చెల్లింపుపై స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపడం అభినందించదగ్గ విషయమన్నారు. అదే విధంగా ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మధుబాబు కూడా బకాయిలో చెల్లింపుపై హర్షం వ్యక్తం చేశారు.

అద్దె భవనాలకు దరఖాస్తులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ అవసరాలకు అద్దె భవనాలు అవసరమని, నగరంలో ఆసక్తి కలిగిన భవన యజమానులు ఖాళీగా ఉన్న భవన వివరాలను శనివారం సాయంత్రానికి అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో క్రెడాయ్, నేరెడ్కో ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం పారిశ్రామికంగా, ఐటీ పరంగా పలు సంస్థలను ఆహ్వానిస్తుందని, అందులో భాగంగా వచ్చే సంస్థల కార్యాలయాల కోసం ప్రత్యేకంగా భవనాలు అవసరమన్నారు. అద్దె ప్రాతిపదికన భవనాలు తీసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆసక్తి కలిగిన భవన యజమానులు తమ భవన సమగ్ర వివరాలను నిర్దేశిత ఫారంలో నింపి అందించాలని కోరారు. అందిన ఫారాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అద్దె, కాల పరిమితి వివరాలు తెలియజేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, సిటీ ప్లానర్ రాంబాబు, క్రెడాయ్ నుంచి శివారెడ్డి, రాము, సాంబశివారెడ్డి, నేరెడ్కో నుంచి దుర్గా ప్రసాద్, శ్రీనివాస కుమార్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని వీధి దీపాలు, తాగునీటి సరఫరాపై అందే ఫిర్యాదులను స్థానిక సచివాలయ కార్యదర్శులు బాధ్యతతో పరిష్కారం చేయాలని, రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను తొలి దశలోనే అడ్డుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. నల్లచెరువు, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజు సచివాలయం పరిధిలో ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నేరుగా పరిశీలించిన తదుపరే బిల్లుల చెల్లింపునకు ప్రాసెస్ చేస్తామని చెప్పారు. రోడ్ల డ్రెయిన్ల మీద ఆక్రమణలను తొలి దశలోనే గుర్తించి తొలగించాలని కోరారు. రెడ్డిపాలెం రోడ్డులో కల్వర్ట్ వద్ద వ్యర్థాలు అడ్డుగా ఉండడం గమనించి, వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు నూతన రోడ్ల ఏర్పాటు ప్రతిపాదనల్లో తప్పనిసరిగా ఎండ్ టు ఎండ్ రోడ్, డ్రెయిన్లు ఉండేలా చూడాలన్నారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ మధుసూదన్, ఏసీపీ మల్లికార్జున పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

మిర్చి యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆంజనేయులు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో రైతుల సమక్షంలోనే మిర్చి బస్తాలు కాటాలు వేయాలని, తూకాల్లో తేడాలు వస్తే సహించేది లేదని యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు హెచ్చరించారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో కాపలాదారులు, వేమెన్స్‌తో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. వేమెన్స్ లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వేమెన్స్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. అంతేకాకుండా డ్రెస్ కోడ్, ఐడీ కార్డులతో పాటు బయోమెట్రిక్ హాజరుతో రైతులు, వ్యాపారుల సమక్షంలో ఈ–నామ్ పద్ధతిలో కాటాలు వేయాలని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, యార్డు పర్సన్ ఇన్‌చార్జి భార్గవ్ తేజ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో వేమెన్స్ అసోసియేషన్ నాయకులు శ్రీహరి, శ్రీనివాసరెడ్డి, బాబు, సోమేష్, పలువురు వేమెన్స్, కాపలాదారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ సిబ్బందిపై ఆగ్రహం

నెహ్రూనగర్: ఇంటి పన్ను కోసం దరఖాస్తు పరిష్కారంలో నిర్లక్ష్యంపై కార్పొరేషన్ సిబ్బందిపై బాధితుడి ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గుంటూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి పన్ను వేయించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అనుకున్నంత డబ్బులు ఇచ్చినప్పటికి పన్ను వేయకపోవడంతో సదరు దరఖాస్తుదారుడు రెవెన్యూ అధికారులను నిలదీశారు. ఫైల్ మా దగ్గర నుంచి ముందుకు వెళ్లింది... డెప్యూటీ కమిషనర్ లాగిన్‌లో ఉందని... అక్కడ అప్రూవ్ కాలేదని... చెప్పడంతో సదరు వ్యక్తి రాత్రి డెప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్దకు వచ్చి సిబ్బందితో వాగ్వివాదానికి దిగాడు. సిబ్బంది అతనికి సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించివేశారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించగా, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.